# 12. బొరుసు

పార్క్‌లో చెట్టు కింద కూచునే వాళ్ళిద్దరూ ఆలోచనల రథ్యలో సాగుతున్నారు. ఆమె రాణి. అతను రాజు. చాలా సేపటికి అన్నది రాణి, 'ఒక విషయం చెప్పటానికి నిన్ను రమ్మన్నాను'.

ఉలిక్కిపడి చూశాడు రాజు. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని, అరచేతిలో పిచ్చిగీతలు గీస్తూ మాట సాగించింది. "అమ్మా నాన్న నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు"

ఆగింది. వంగి రాజు కళ్ళల్లోకి చూసింది. ఆమె చెవిజూకా అతని చెంపకి తగిలింది. భావశూన్యంగా చూస్తున్నాడతను. ఆమే అన్నది, "వంకాయల వారి సంబంధమేదో బాగుందిట".

'ఊఁ' అన్నాడు, అతి దీర్ఘంగా. ఆ వేడి ఆమెకి తగిలింది. సర్దుకుంది. పమిట సరి చేసుకుని, బుజం మీంచీ తిప్పి, నిండుగా కప్పుకుంది. దిక్కులు చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

రాజుకి పరిస్థితి అర్థమయింది. నాందీ, ప్రస్తావనా అయిపోయాయి. ఆమెకి అతని ప్రతిస్పందన కావాలి. రాజు మాట్లాడలేదు. క్షణాలు గడుస్తున్నై.

లైట్లు వెలిగినై. నగరం వెలుగు చీకట్ల నర్తనశాలగా మారింది. రాణి అతని కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది. "అతను యుయస్‌లో వున్నాట్ట. డిశంబర్‌లో వచ్చి పెళ్ళి చేసుకుని వెళ్తాట్ట. ఈలోగా వాళ్ళ అమ్మా నాన్నా వచ్చి చూస్తార్ట" గాలికి చెబుతున్న ఊసులా ముగించింది.

మళ్ళీ మౌనం. ఎవరికి ఎవరో లాగా వుండిపోయారు.

పావుగంట గడిచింది. రాణిలేచి "వెళ్దాం పద" అంటూ అడుగులు వేసింది. ఆమెను అనుసరించాడు రాజు. ఆమె త్వరత్వరగా.... అతనికంటే ముందుకు.... ముందుకు నడవసాగింది.

ఆరాత్రి రాజు మనసంతా వికలమైంది. రాణి ఆలోచనలతో అతని నిద్ర పోయింది. రాణి అతని అత్త కూతురు. చిన్నప్పట్నుంచీ ఇద్దరి మధ్యా చనువు ఎక్కువే. బిఏ దాకా కలిసి ఒకేకాలేజీలో చదివారు. ఆ తర్వాత ఆమె పీజీకి హైదరాబాద్ వచ్చింది. సైకాలజీలో టాపర్‌గా నిలిచింది. పిహెచ్‌డి కూడా చేసింది. రేపోమాపో ఉద్యోగంలో చేరుతుంది. లేదా ఇంకా ఉన్నతమైన మార్గాన్ని ఎన్నుకుంటుంది. అనుకున్నది సాధించే తత్వం. సాహసి.

రాజు డిగ్రీతో ఆగి, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఓసారి కలిసినప్పుడు అన్నది రాణి. 'కుటుంబ బాధ్యతంతా నీ భుజస్కంధాలమీదే ఉందనుకోక తప్పని పరిస్థితి నీది. ఒప్పుకుంటాను. కానీ, నీ భవిష్యత్తుని గురించీ నువ్వాలోచించుకోగలగాలి. మీ తమ్ముడేం చిన్నవాడు కాదు. ఉన్న ఆ చేరెడు నేలనీ అతను చూసుకోగలడు. చెల్లెళ్ళిద్దరూ ఇంకా చదువుల్లో ఉన్నారు గదా" అని.

రాజు ఏమీ సమాధానం చెప్పలేదు. ఆమె వెళ్ళి పోయింది.

ఇది జరిగిన పదిరోజుల తర్వాత – ఓ ఆదివారం–

రాణి, రాజూ వాళ్ళింటి కొచ్చింది. చాలాసేపు కూచుంది. అత్తమ్మతో చాలా పాతముచ్చట్లు చెప్పింది. ఆమె కూతుళ్ళతో సరదాగా సినిమా కబుర్లు మాట్లాడింది. ఆ రాత్రి భోజనం చేసి తాముండే మియాపూర్ వెళ్ళిపోయింది. రాజూ వాళ్ళుండేది దిల్‌సుఖ్‌నగర్‌లో.

రాణి వెళ్ళిన తర్వాత రాజు తల్లి పెళ్ళి ప్రస్తావన తెచ్చింది. అతనేమీ యిదమిత్థంగా తన భావాల్ని చెప్పలేదు. అత్తమామలు రాణికి వేరే సంబంధాలు చూస్తున్నారనే సందేశాన్నిచ్చాడు.

ఆ మర్నాడే రాజు తల్లి మియాపూర్ వెళ్ళి రాణి తల్లిదండ్రులతో నిష్ఠూరాలాడింది. రాణి తల్లి స్పష్టంగానే తమ అభిప్రాయం చెప్పింది, "ఎటూ తేల్చకుండా ఎన్నాళ్ళుంటాం. వచ్చే వయస్సుగదా ఆడపిల్లకి, ఒక్కగా నొక్క పిల్ల. దాని భవిష్యత్తు ముఖ్యం గదా మాకు"

రాజు తల్లి దిక్కులు లెక్కించుకుంటూ వచ్చింది. కొడుక్కి చెప్పింది. విని వూరుకున్నాడు.

డిశంబరులో రాణి పెళ్ళి జరిగిపోయింది. ఆమె భర్త సుధాకర్. కలుపుగోలు మనిషి. అతనిది మంచి రూపం, మనిషి స్ఫురద్రూపి. మాటతీరు ఎదుటివారిని ఆకర్షిస్తుంది.

వారం తర్వాత - రాజుకి ఫోన్.

'ఇవ్వాళ రాత్రే ఎనిమిదిగంటలకి మనం చట్నీస్‌లో కలుస్తున్నాం" అని నవ్వుతూ చెప్పింది రాణి. వివరాలు సుధాకర్ చెప్పాడు. "మీ కోసం వెయిట్ చేస్తూవుంటాం" అన్నాడు.

ఆ రాత్రి హోటల్లో కలిశారు రాణి, సుధాకర్, రాజు.

ముందుగా అసందర్భమైన పరామర్శలతోనూ, అప్రస్తుతమైన దేశ రాజకీయాలతోనూ కొంత సమయం గడిచింది. ఆ తర్వాత అమెరికా కబుర్లు చెప్పాడు సుధాకర్. అతని కబుర్లతో మాట కలుపుతూ, పాటికి పదిసార్లు 'సుధా' 'సుధా' అంటూ భర్తను మురిపెంగా సంబోధిస్తున్న రాణిని చూసీ, ఉత్సాహాన్ని చూసీ ఆశ్చర్యపోయాడు రాజు. "వుయ్ విల్ బి యిన్ సూప్" అని జోక్ చేస్తూ డిన్నర్ ఆర్డర్ చేశాడు సుధాకర్. సూప్ వచ్చింది. సిప్ చేస్తుండగా మొదలెట్టింది రాణి, "నిజానికి నేను మా బావమనిషిననీ, అతను నా వాడనీ- మా చిన్నప్పట్నుంచీ మావాళ్లందరూ నిర్ణయించేశారు. మేమూ అలాగనే భావిస్తూ వచ్చాం.'

రాజు గతుక్కుమన్నాడు. సిగ్గుపడ్డాడు. ఆమె కొనసాగించింది. "అయితే మా బావ వస్తుతహా తాపీ ధర్మారావు తరహా. స్లో మనిషి. వ్యవహారాలన్నిటా 'పార్కిలాం' విధానం. మీ సంబంధంగురించి చెప్పినప్పుడు కూడా విని వూరుకున్నాడు. అందుకనే నా నిర్ణయం నేను తీసుకున్నాను. ఈ బ్యాక్‌గ్రౌండ్ చెప్పాలనే ఉద్దేశంతోనే ఈ డిన్నర్ పెట్టుకున్నా. భయమూ, పిరికితనమూ నాకు నచ్చవు. అవి మా బావ దగ్గర పుష్కలంగా వున్నై. నన్ను చూసి కొంత చొరవ నేర్చుకుంటాడని ఆశించాను. కానీ... 'ప్చ్'... అని చిత్రంగా పెదవివిరిచి, రాజువైపు చూసి కళ్లు చికిలించింది. సుధాకర్ మాత్రం "బాగుంది థింగ్స్ ఆర్ క్లియర్" అని తన ప్రోగ్రాం కబుర్లు చెప్పసాగాడు.

డిన్నర్ ఐటమ్స్ వచ్చినై. చిన్ననాటి ముచ్చట్లు చెబుతూ భోజనం చేసింది రాణి. మధ్యలో మరో మాటా అన్నది, "పొసగదనుకున్న పొత్తుకంటే, స్నేహితులుగా ఉండిపోవడం మేలు గదా" అని.

పది దాటిన తర్వాత - రాణికీ, సుధాకర్‌కీ వీడ్కోలు చెప్పి వచ్చేశాడురాజు. ఆ రాత్రికిక నిద్రపట్టలేదు రాజుకి. "నాకు భయమూ, పరికితనమూ ఎక్కువే. తన భర్తముందు ఈ విషయాన్నే కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది రాణి. కానీ, రాణినే వద్దనుకునేటంతటి మొద్దు స్వరూపాన్నా - నేను?" అనే ప్రశ్న అతని బుర్రలో గిరికీలు కొట్టసాగింది. వేదన పడ్డాడు.

అక్కడ - మియాపూర్‌లో సుధాకర్‌తో రాజు స్వరూప స్వభావాల చిత్రణని ఇంకాస్త వివరంగానే చేసింది. తమ బాల్యచేష్టల్లోనూ - రాజు 'స్లోనెస్'నీ, భయాన్నీ కొన్ని ఉదాహరణలతో సహా చెప్పింది. చివరికి, "ఇదీ మా బావ ప్రొఫైల్. ఏమంటారు?" అన్నది.

అంతా విని, "చిన్న విశ్లేషణ యిస్తాను. ఏమనుకోవుగా?" అడిగాడు సుధాకర్. "చెప్పండి. అనుకోవటానికేం వుంది. అంతా క్లియర్" అన్నది రాణి.

నిమ్మళంగా చెప్పసాగాడు సుధాకర్. "నువ్ చేరుకోవాలనుకున్న చిటారుకొమ్మకి నీతోపాటు కలిసి అతను ఎక్కలేదని నువ్ డిగ్రీ కాగానేనే అర్థం చేసుకున్నావ్ రాణీ. నీతో అతను పరిగెత్తలేడని నీకు తెలుసు. నువ్ మూడడుగులు ముందుకేసినా, అతను ఆరడుగులు వెనక్కి లాగుతాడనీ నీకు తెలుసు. అప్పుడే నువ్వొక నిర్ణయానికి వచ్చేశావు. ఆ మాట అతని నోటనే రావాలని ఆశించావ్ నువ్వు. వస్తే సంతోషపడే దానివి. మా బావ నన్ను చేసుకోకన్నాడు కనుక నేను మరొకర్ని చూసుకుంటున్నానని చెప్పుకోగలిగేదానివి. కానీ, ఆ తృప్తినీ, సంతోషాన్నీ అతను నీకివ్వలేదు. అప్పుడిక నువ్వే చొరవ తీసుకుంటున్నట్లూ, ఆ చొరవకి - రాజు స్లోనెస్, భయం,. పిరికితనం కారణమన్నట్లు చెప్పు కొని - నిన్ను నువ్ పైమెట్టులోనే నిలబెట్టుకున్నావ్. ఎంతైనా సైకాలజీలో డాక్టర్‌వి గదా?!" అని చిరునవ్వు నవ్వాడు.

అప్పటికెప్పుడో రాణిముఖం వివర్ణమైంది. తనకంటే తన భర్త మరీ పెద్ద మనస్తత్వ వేత్త అనిపించింది. పెదవుల మీద చిరునవ్వు విరిసింది. "యూ ఆర్ గ్రేట్ - సుధా!" అని చేయి కలిపింది. "నా కథకి ఏకంగా తోక తగిలించి, కంచిలో పడేశావ్" అంటూ మరీ మరీ నవ్వసాగింది!!

❖